# మగ మనసు—ఆడ మనిషి!

# మగ మనసు—ఆడ మనిషి!

ఉచ్ఛ్వాసం పేషెంటులాగ రైలు ప్లాటుఫారం మీద కొచ్చి ఆగి ఆయాసపడుతోంది!

ఎక్కే దిగే జనంతో కంపార్టుమెంటు చాలా రద్దీగా వుంది!!

అమ్ముకునే వాళ్ళు...అడుక్కుతినే వాళ్ళు... కేకలు అరుపులతో... ప్లాట్ ఫారమంతా నానా భీభత్సంగా వుంది.

గాలి స్తంభించటంతో తల్లుల ఒడిలోవున్న పసిపిల్లలు ఏడుస్తున్నారు.

కిటికీ పక్కనేవున్న సీట్లో కూర్చున్నాడు రమణ!

సిగరెట్ వెలిగించి. చేతిలోవున్న పుస్తకం తిరిగేస్తు న్నాడు.

రైలు కదిలింది!-

రమణ ఎదురు సీట్లో ఓ పాతికేళ్ళ యువతి కూర్చు

నుంది - తెరలు తెరలుగా వచ్చే దగ్గును ఆపుకో ప్రయత్ని స్తోంది. కిటికీలోంచి తలబైటకి పెట్టి అప్పుడప్పుడు వుమ్మే స్తోంది.

ఆమె పడే బాధ చూస్తున్న రమణ మనసు కలుక్కు మంది!

గతం గుర్తుకొచ్చిన రమణ బరువుగా నిట్టూర్చాడు.

"ఏమిటండీ...సుస్తీ?" పక్కనే కూర్చున్న ఆమె భర్త నడిగేడు రమణ.

భార్యకి 'టి. బి' అని చెప్పుకునేందుకు బిడియ పడ్డాడా వ్యక్తి.

ఆమె భవిష్యత్ ఏమవుతుందో ననే భయం, అంతకు మించిన ఆందోళన అతని ముఖంలో వ్యక్తమవటం గమనిం చేడు రమణ.

రమణ కంటిలో నీరు నిల్చింది! తల పక్కకు తిప్పుకుని కళ్ళొత్తుకున్నాడు.

ఇంటినుంచి బయల్దేరి రమణ నాలుగురోజు లైంది. తనెక్కడికి వెళుతున్నదీ వివరంగా చెప్పకుండా బయల్దేరేడు.

నిజాన్ని దాచి భారతిని మెప్పటి కప్పుడు మోసం చేస్తున్నాడేమోనని అన్పిస్తున్నప్పటికీ అసలు విషయం చెప్పేందుకు సాహసించలేక పోతున్నాడు రమణ.

మరునాడే తిరిగొస్తాననేసి చెప్పిన రమణ నాలుగు రోజుల తర్వాత ఇంటి కొస్తున్నాడు.

ఆలస్యంగా యింటి కొచ్చినందుకు భారతికి కోపం

వస్తుంది. మనస్సు విప్పి మాట్లాడదు. వాకిట్లో చిరునవ్వుతో ఎదురై ఆహ్వానించదు.

ఆమె అలుక తీర్చేందుకు మరో అబద్ధాన్ని సృష్టించాల్సి వస్తుంది తను.

ఒక్క గంట ఆఫీసునుంచి ఇంటికి రావటం ఆలస్యమైతేనే బెంగ పెట్టుకునే భారతి నాలుగు రోజులపాటు తను కంటికి అవుపించకపోతే...ఎలా వుండగలిగిందోననే ఆలోచన?...

భారతి వేసే ప్రశ్నలకు సంజాయిషీ ఏమని చెప్పుకోవాలని ఆలోచించ సాగేడు రమణ.

కొత్తగా పెళ్ళయిన రోజుల్లో...భారతితో ముందుగా చెప్పకుండా సినిమాకు వెళ్ళినందుకే ఆ రాత్రంతా తనతో మాట్లాడలేదు - నిరసనగా భోజనం మానేసి వుపవాసం చేసిన రాత్రి తనింకా మర్చిపోలేదు.

ఇప్పుడు...అంతకంటే ఎలాంటి కఠినమైన శిక్ష విధిస్తుందో...ఊహ కందకుండా వుంది.

రైలు రమణని గమ్యాన్ని చేర్చింది!

అర్ధరూపాయికి రిక్షా బేరమాడి, ప్రక్కనేవున్న పూల కొట్లో ఓ పావు శేరు మల్లెపూలు కొని రిక్షా ఎక్కేడు రమణ.

రోడ్డుమీది జనాన్ని, బళ్ళను, కాలువలనూ దాటుకుంటూ ఇల్లు చేరింది రిక్షా!

బాడుగ డబ్బు లిచ్చి పంపేసి గేటు తోసుకుని పంచలో కొచ్చేడు రమణ.

వాకిలికి తాళంవేసి వుంటం చూశాడు.

పక్కింటికి పేరంటానికేమయినా వెళ్ళిందేమోనని హేండ్ బేగ్ నేలమీద వుంచి తనూ చతికిలబడ్డాడు పంచలో.

పది నిమిషాలు గడిచేయి.

పక్క వాటాలో పిన్నిగారు తలుపుతీసుకుని బైటికొచ్చి "ఎంత సేపయింది నాయనా వచ్చి?" అడిగింది.

"ఇదేనండి రావటం..."

"మంచినీళ్ళేమైనా కావాలా?"

"వద్దండి! భారతి యెక్కడికెళ్ళిందో మీ కేమైనా తెలుసా...?"

"అయ్యో! నా మతిమరుపు మండిపోనూ...అన్నట్టూ నువ్వాటు ఊరెళ్ళగానే...ఆ సాయంత్రమే ఇల్లుతాళంవేసి... బీగం నా చేతికిచ్చి పుట్టింటి కెడుతున్నానని చెప్పమంది..."

ఇంట్లోకెళ్ళి తాళంచెవి తెచ్చి యిచ్చింది పిన్నిగారు.

అంత అర్జంటుగా భారతి పుట్టింటి కెందుకెళ్ళిందో అర్థంకాలేదు రమణకి.

బహుశః...యింట్లో వంటరిగా వుండేందుకు ఇష్టంలేక వెళ్ళిందేమో అనుకున్నాడు.

ఇంట్లో కెళ్ళగానే టేబిల్ మీద వుత్తరం అవుపించింది.

"ఏమండీ!

క్షమించాలి! నా మనసేం బాగుండక పుట్టింటికి వెళుతున్నాను. మళ్ళీ ఎప్పుడొస్తానో చెప్పలేను.

శలవ్

భారతి."

ఉత్తరంలో వున్న మాటలు రమణలో ఆశ్చర్యాన్ని కలుగజేసింది. పోనీ...అంత అర్జంటుగా వెళ్ళవలసి వచ్చిన కారణం కూడా ఉత్తరంలో వ్రాస్తే బావుండే దనిపించింది.

అర్థంకాని ఆడవాళ్ళ మనస్తత్వాన్ని గురించి ఆలోచించలేక ప్రస్తుతానికి ఊరుకున్నాడు.

*　　　*　　　*

భారతి ఇంట్లో లేకపోవడంవల్ల రమణకు బొత్తిగా పొద్దుపోవటంలేదు. తన వంటరితనానికి దిగులుపడసాగేడు.

పెళ్ళిపీటలమీాది పసుపుబట్టల నాటినుంచీ ఒకరి నొకరు విడిచి వుండలేదు.

అలాంటిది...నాలుగు రోజులు తను వూళ్ళోలేని కారణంగా భారతి యెంతటి కఠినమైన శిక్ష విధించింది అనుకున్నాడు.

భారతి ప్రతి చిన్న విషయానికి బాధపడి మనసు కష్టపెట్టుకుంటుందనే నిజం తనకు తెలుసు. గోరంతలు కొండంతలు చేస్తుంది. తొందరపాటు మనిషి!

ఆమె సున్నితమైన మనస్తత్వానికి పెళ్ళయిన కొత్తల్లో కంగారు పడ్డాడు.

మల్లెపూలు కొనివ్వకపోయినా బాధపడదు గానీ... మనస్సువిప్పి మాట్లాడకపోతే మాత్రం ఆగ్రహిస్తుందనే విషయం త్వరలోనే తెలుసుకో గలిగేడు.

నిత్యమూ భర్త కొంగు పట్టుకునే తిరగాలనుకునే స్వభావం!

ఇంట్లో ఆడదిక్కులేని లోటు ఏపాటిదో రమణకు అర్థమవసాగింది.

ప్రతిపనీ తనే స్వయంగా చూచుకోవాలంటేనూ బాధగానే వుంది.

స్నానానికి నీళ్ళదగ్గరనుంచీ సర్వం తనే చేసుకోవాల్సి వస్తున్నందుకు విసుగ్గావుంది.

భార్య లేని జీవితం 'బోర్' అనుకున్నాడు.

వంటరి జీవితంలోగల అసంతృప్తి అర్థం చేసుకోగల్గు తున్నాడు.

హోటల్ భోజనం సరిపడక ఉపవాసాలు కూడా చేయాల్సి వస్తోంది.

పందిరిమంచం, పరుపూ ప్రతి రాత్రీ వెక్కిరిస్తు న్నాయ్!

తన బాధలన్నీ ఏకరువు పెడుతూ ఓ పెద్ద లిస్టు తయారుచేసి ప్రతి వుత్తరంలోనూ భారతికివ్రాసి త్వరగా రావలసిందిగా అర్థించాడు.

నాలుగు ఉత్తరాలు వ్రాసినా...భారతినుంచి ఏ విధ మైన సమాధానమూ రాకపోవటంతో...నిరుత్సాహ పడ టమే కాకుండా ఆశ్చర్యపోయాడు.

పోనీ...తనే బయల్దేరి వెడదామా అంటే...ఆఫీసులో ఇన్స్పెక్షన్ జరుగుతున్న కారణంగా శెలవు దొరికింది కాదు.

తన పరిస్థితి ఆఫీసులోవాళ్ళ కేం తెలుసు? యము లాళ్ళు!...ఇన్స్పెక్ష నంటూ...ఇప్పుడే తగలడాలా?? తిట్టు కున్నాడు రమణ.

ఇంటికి తాళం బిగించి ఆఫీసుకు బయల్దేరబోతుంటే పోస్టుమేన్ ఎదురై కవరొకటి అందించాడు.

ఆనందంతో పుబ్బిపోయాడు. ఇప్పటికైనా శ్రీమతి తనను కరుణించినందుకు సంతోషించాడు.

గిరున వెనక్కు తిరిగి ఇంట్లోకెళ్ళి తాపీగా కుర్చీలో కూర్చుని కవరు చించాడు.

"ఏమండీ!

అసలు మీకు ఉత్తరమే వ్రాయకూడదనుకున్నాను—మనసు వద్దని వేధిస్తున్నా...ఇదే ఆఖరి వుత్తరంగా వ్రాస్తున్నాను.

నా బాధకు కారణం...?

సంవత్సరం మీతో కాపురంచేసి...మీమనసు నర్థం చేసుకోలేకపోయాను.

నా నిర్ణయాన్ని మార్చుకునే శక్తి నాకులేదు. ఏం చేయను? ఆడదాన్ని!!...

నా దగ్గరకొచ్చేందుకు ప్రయత్నించకండి. నేను మీకు శాశ్వతంగా దూరం కావలసి ఉంటుంది.

భారతి."

ఉత్తరం చదివేసరికి రమణకు వళ్ళంతా చెమటలు పట్టింది—తన గొంతు నెవరో బలంగా పిసుకుతున్నట్లైంది. కత్తితో గుండెను చీల్చినట్టు బాధపడ్డాడు.

ఇక తను ఎవరికోసం బ్రతకాలి?...

ఇన్నాళ్ళూ ఏ విషమైతే భారతికి తెలియకూడదు...

తెలిస్తే ఆమె సున్నితమైన హృదయం బాధపడుతుందని రహస్యంగా దాచాడో...బహుశః అదేవిషయం భారతికి తెలిసి వుంటుంది!...అదే విషయం భారతిలో ఈ విధమైన కఠినమైన నిర్ణయాన్ని కలిగించి వుంటుంది.

నో!...తనుగా చెప్పని ఈ విషయం...ఎంతో రహస్యంగా వుంచిన విషయం...భారతి కెట్లా తెలిసింది?

భార్య భవిష్యత్ గురించి ఆందోళన పడసాగేడు.

భారతిని చూచేందుకు వెళ్ళేందుకు భయపడసాగాడు.

భారతి లేకపోతే...?

రమణ బుర్ర ఆలోచనలతో వేడెక్కింది.

పర్యవసానంకోసం ఆలోచించ నారంభించేడు.

* * *

భారతి భవిష్యత్ పట్ల ఆందోళన, భయం, ఆదుర్దా, బాధ...రమణను పీక్కుతింటున్నాయి! - పిచ్చివాడ్ని చేస్తున్నాయి!!—

కాల్చిపారేసిన సిగరెట్ పీకలు గదినిండా చిందరవందరగా పడి సాలెగూడులాగ అల్లుకున్నాయి—

నిర్జీవమైన కళ్ళు కొడిగట్టిన కొవ్వొత్తిలా వున్నాయి. అనిశ్చలమైన మనసులో ఆలోచన్లు బీటలువారి బీడుపడ్డట్టున్నాయి—

రాత్రి పన్నెండు గంటలు దాటింది.

తలుపు చప్పుడైంది—

'భారతీ!' పెద్దగా, వెర్రిగా అరచాడు రమణ.

ఆ అరుపులో ఆనందం...ఆనందం వెనకాల తృప్తి...

'భారతి వచ్చేసింది! భారతి నాకోసమే వచ్చేసింది! నాకు తెలుసు భారతి వస్తుందని...' అనుకుంటూ గబగబా వెళ్ళి తలుపు తీశాడు.

"టెలిగ్రాం సార్..." పోస్టు మెసింజరు గొంతు విన్పించింది.

వణికే చేతులు టెలిగ్రామును తీసుకున్నాయి–

చదివేడు!

తన తలను మొండెంనుంచి వేరుచేసినట్టన్పించింది.

భారతిని చూద్దామనే ఆదుర్దాలేదు- ఆశాలేదు.

తను నేరస్తుడు! ... కాదు ఖూనీకోరు!! కాదు... హంతకుడు!!!–

ఒక నిండు ప్రాణాన్నీ, అమాయక హృదయాన్ని బలితీసుకున్న దుర్మార్గుడు.

కట్టు గుడ్డలతో బయల్దేరాడు! రైలెక్కాడు!!

తెల్లవారేసరికి రమణ గమ్యాన్ని చేరుకున్నాడు. ప్రాణంలేని కట్టెలాగ నిర్జీవంగా రిక్షా యెక్కాడు.

ఇంట్లో కెళ్ళాడు!

ఎన్నో ఏడుపుల ధ్వనులతో రమణ చెవులు దిబ్బెడలు పడ్డాయి.

భారతి శవంముందు కుప్పలా కూలిపోయాడు. రమణ కంటిలో నీరు ఆరిపోయింది! కంఠం మొద్దువారిపోయింది!!

"అమ్మాయి ఆఖరిసారిగా నీ కిదివ్వమన్నది" అనేసి ఉత్తరం అందించారు రమణకి.

"ఏమండీ!

మీరు నా శవాన్ని చూచేందుకైనా వస్తారని తెలుసు! అందుకే ఉత్తరం వ్రాసి వుంచాను.

ఏ విషయమైతే మీరు నాకు చెప్పకుండాదాచారో... చెబితే నే బాధపడతారనుకున్నారో...అదే...నన్ను మీ నుండి శాశ్వతంగా దూరంచేసింది

మీ రటు ఊరెళ్ళగానే మీకో ఉత్తరం వచ్చింది. చించి చదివేను. మీ మొదటిభార్య తండ్రిగారు మీ చిరంజీవి పుట్టినరోజు పండుగకు రావలసిందిగా వ్రాశారు.

ఇదివరలో మీకు ఒక వివాహమైందనీ, మీకో చిరంజీవి కూడా వున్నాడనే విషయం దాచిపెట్టి...నన్ను వివాహం చేసుకున్నారు - నన్ను మోసం చేశారు!!

తర్వాత అనుమానం కొద్దీ మీ పెట్టె వెతికేను. గుడ్డలకింద కొన్ని వుత్తరాలు అవుపించాయి! అన్నీ చదివేను!!

ఆమె భయంకరమైన 'టి. బి.' వ్యాధితో మరణించిందని అర్థమైంది. నన్ను పెళ్ళాడేకైనా నిజం నాతో ధైర్యంగా చెప్పగల మంచిమనసు మీకు లేకపోయింది. నన్ను వంచించారు.

మీరు చేసిన మోసానికి ప్రతీకారంగా బాధతో బ్రతకటం ఇష్టంలేక, మానసిక వ్యధ భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాను.

ఏం చెయ్యను? ఆడదాన్ని !!

భారతి."

పిచ్చివాడిలా పెద్దపెట్టున నవ్విన రమణ కంఠంలో కొన్ని కోట్ల ఏడ్పులు ధ్వనించాయి.